దర్జాగా కబ్జా

- ఆరిలోవ ప్రాంతంలో గెడ్డల ఆక్రమణ
- స్థలాలు చదును చేయించి నిర్మాణాలు, విక్రయాలు
- దృష్టి సారించని అధికారులు


పెదగదిలి గెడ్డ పక్కన ఆక్రమణకు గురైన స్థలం

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలోని గెడ్డలు కబ్జాకు గురవుతున్నాయి. ఆక్రమణదారుల కారణంగా ఈ ప్రాంతానికి ప్రకృతి ప్రసాదించిన సహజ సిద్ధమైన గెడ్డల స్వరూపం మారిపోతోంది. వరద నీరు ప్రవహించే విశాలమైన గెడ్డలు కాస్తా ఆక్రమణకు గురై కాలువలుగా మారుతున్నాయి. కంబాలకొండల వెనుక భాగం నుంచి ఆరిలోవ ప్రాంతానికి ఎక్కువగా గెడ్డలున్నాయి. ఇవి కొండల నుంచి ఆరిలోవలోని పలు కాలనీలు, ఎంవీపీ కాలనీ మీదుగా సముద్రంలో కలుస్తున్నాయి. గెడ్డలు వెడల్పుగా ఉండటంతో ఎంత భారీ వర్షం కురిసినా వరద నీరు ధారాళంగా కిందకు ప్రవహించేది. కొన్నాళ్లుగా ఈ గెడ్డలు ఆక్రమణకు గురికావడంతో కుచించుకుపోయాయి. కొన్నిచోట్ల కాలువలుగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆక్రమణదారులు గెడ్డలపై మరింత దృష్టి సారించారు. గెడ్డ అంచులు, వాటిని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలపై కన్నేశారు. వాటిని చదును చేయించి విక్రయాలకు పెడుతున్నారు. తోటగరువు, పెదగదిలి, గాంధీనగర్, ప్రియదర్శిని కాలనీ, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లోని గెడ్డలు ఆక్రమణకు గురయ్యాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి గెడ్డల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

పెదగదిలి వద్ద గెడ్డ స్థలం

పెదగదిలి కూడలి నుంచి తోటగరువు వెళ్లే మార్గంలో పెద్ద గెడ్డపై జీవీఎంసీ ఇటీవల బ్రిడ్జి నిర్మించింది. ఈ గెడ్డ అంచున రెవెన్యూ, పశు సంవర్థక శాఖకు చెందిన విశాలమైన ఖాళీ స్థలం ఉంది. ఇక్కడ గెడ్డ భాగంతోపాటు ఆ ఖాళీ స్థలం ఇటీవల ఆక్రమణకు గురైంది. కొందరు వ్యక్తులు ఇక్కడ గెడ్డ స్థలంలో డెబ్రిస్ వేసి చదును చేయించారు. దీనిలో షెడ్‌లు నిర్మించారు. కంబాలకొండల నుంచి చిన్న గెడ్డలతోపాటు ఆరిలోవలో పలు కాలనీల నుంచి కాలువల ద్వారా వచ్చే వాడుక నీరు సైతం దీనిలో కలుస్తుంది. ముడసర్లోవ రిజర్వాయర్ వర్షా కాలంలో సామర్థ్యాన్ని మించి ఓవర్‌ఫ్లో అయినప్పుడు.. ఆ నీరు కూడా ఈ గెడ్డలోకే చేరుతుంది. ఇంత వరద నీరు కిందకు ప్రవహించే ఈ గెడ్డ ఆక్రమణకు గురై సన్నబడుతోంది. భవిష్యత్‌లో వరద నీరు ప్రవహించే మార్గం మూతపడే పరిస్థితి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ ఆక్రమణలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


ప్రియదర్శిని కాలనీ-శ్రీహరినగర్ మధ్యలో గెడ్డ అంచును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు

శ్రీహరినగర్ గెడ్డ అంచుల్లో..

జీవీఎంసీ 11వ వార్డు ప్రియదర్శిని కాలనీ, శ్రీహరినగర్ మధ్య గెడ్డ అంచులు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇటీవల ఈ కాలనీ మధ్య గెడ్డ అంచులను ఆక్రమించి కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. జీవీఎంసీ ఈ గెడ్డకు అడుగు భాగంలో కాంక్రీట్ వేసి ఇరుపక్కలా రక్షణ గోడలు నిర్మించింది. వాటిని ఆనుకుని ఖాళీ స్థలంలో గ్రీనరీ ఏర్పాటు చేయదలచింది. ఆ ఖాళీ స్థలాలను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇక్కడి అక్రమ నిర్మాణాలను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది కొద్ది నెలల కిందట తొలగించారు. అయినా కొందరు టీడీపీ నాయకుల అండతో ఆక్రమణదారుడు మళ్లీ నిర్మాణాలు చేపట్టేస్తున్నారు.

డ్రైవర్స్ కాలనీ ఖాళీ స్థలంపై కన్ను

11వ వార్డు డ్రైవర్స్ కాలనీలో గెడ్డ అంచున జీవీఎంసీకి చెందిన స్థలం ఉంది. కొన్నేళ్ల నుంచి ఖాళీగా ఉన్న ఈ స్థలంలో సామాజిక భవనం నిర్మించాలని స్థానికులు పలుసార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. దీనిపై ఎవ్వరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొందరు టీడీపీ నాయకులు దీనిపై దృష్టి పెట్టారు. ఆ స్థలంపై దొంగ పట్టాలు సృష్టించే ప్రయత్నంలో ఉన్నారు. వాటి ద్వారా ఆ స్థలాన్ని భాగాలుగా చేసి అమ్మకానికి పెడుతున్నారు. ఈ స్థలాన్ని ప్రజా అవసరాల కోసం వినియోగించాలని అధికారులకు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


గెడ్డ అంచున ఆక్రమణకు సిద్ధం చేసిన స్థలం

గాంధీనగర్ గెడ్డ స్థలంలో నిర్మాణం


గాంధీనగర్ వద్ద యూపీహెచ్‌సీ ఎదురుగా గెడ్డ స్థలం ఆక్రమించి నిర్మించిన రేకుల షెడ్

జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లో గెడ్డ అంచున ఖాళీ స్థలం ఆక్రమణకు గురైంది. ఈ గెడ్డను కూడా గతేడాది జీవీఎంసీ ఆధునికీకరించింది. అడుగు భాగంలో సిమెంట్ కాంక్రీట్ వేసి గోడలు నిర్మించింది. గెడ్డ అంచుల్లో పచ్చదనంతో పార్కులు ఏర్పాటు చేయదలచింది. ఈ గెడ్డ వద్ద కూడా అంచులు ఆక్రమణకు గురవుతున్నాయి. ఓ వ్యక్తి ఇక్కడ స్థలం చదును చేసి రేకులు షెడ్ నిర్మించి అమ్మకానికి పెట్టాడు.

క్లుప్తంగా

ఎంవీపీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

ఎంవీపీకాలనీ: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సోమవారం సాయంత్రం ఎంవీపీ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పలువురు అధికారులతో కలిసి ఆయన స్టేషన్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో స్టేషన్‌లో ఉన్న ఫిర్యాదుదారులతో మాట్లాడి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ అధికారులు, సిబ్బంది ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. స్టేషన్‌లో రికార్డులు ఎలా నిర్వహిస్తున్నారనే దానిపై తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాల శుభ్రతను పరిశీలించారు. ఆయా అంశాలకు సంబంధించి సీఐతోపాటు సిబ్బందికి సీపీ పలు సూచనలిచ్చారు.

ఎల్వీపీలో అత్యధికంగా కార్నియా మార్పిడీలు


ఆరిలోవ: ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో అధిక సంఖ్యలో కార్నియా మార్పిడీలు జరిగినట్లు ఎల్వీపీ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 1987 నుంచి ఇంతవరకు 50 వేలకు పైగా కార్నియా మార్పిడీలు జరిగాయని వెల్లడించారు. ప్రపంచంలోనే అత్యధికంగా కార్నియా మార్పిడి జరిగిన సంస్థగా ఎల్వీపీ గుర్తింపు పొందిందన్నారు. శోక సమయంలో దాతల కుటుంబాలు ముందుకొచ్చి కార్నియా దానం చేయడం వల్ల ఇది సాధ్యపడిందని చెప్పారు. ఆయా కుటుంబాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ నేత్ర నిధుల్లో ఈ ఘనత సాధించినట్లు ఆయన తెలిపారు. ఎల్వీపీలో కంటి వైద్య నిపుణులు నిరంతరం నేత్ర పరిశోధనలు చేస్తున్నారన్నారు.

దుర్గానగర్ పైప్‌లైన్ పరిశీలన


దుర్గానగర్ కొండవాలులో పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ ఈఈ ఏడుకొండలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్ కొండవాలు ప్రాంతంలోని తాగునీటి పైప్‌లైన్‌ను సోమవారం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) ఏడుకొండలు పరిశీలించారు. పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా ఎదుర్కొంటున్న నీటి సమస్యలను భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీంతో పైప్‌లైన్‌ను జీవీఎంసీ ఈఈ పరిశీలించి, సమస్యను తర్వలోనే పరిష్కరిస్తామని స్థానికులతో అన్నారు. కాలనీ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలం


ఏయూ ఉద్యోగి శ్రీనివాస్ ఇంట్లో వికసించిన బ్రహ్మకమలం

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఉద్యోగి ఎస్.శ్రీనివాస్ ఇంట్లో అరుదైన బ్రహ్మకమలం వికసించింది. విశాలాక్షినగర్‌లోని ఆయన నివాసంలో ఈ పుష్పం కనువిందు చేసింది. ఈ పువ్వు ఏడాదికి ఒకటి మాత్రమే విరబూస్తుంది. పూసిన రెండు మూడు గంటల్లోనే మళ్లీ నిద్రిస్తుంది. గతంలో కూడా శ్రీనివాస్ ఇంట్లో బ్రహ్మకమలాలు విరబూశాయి.

రక్షణ గోడ లేని బ్రిడ్జి


పార్వతీనగర్-సూర్యతేజనగర్ మధ్య బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా కాలువ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో ఇటీవల నిర్మించిన బ్రిడ్జి వద్ద ప్రమాదం పొంచి ఉంది. సూర్యతేజనగర్, పార్వతీనగర్ మధ్య ఉన్న పెద్ద గెడ్డపై సుమారు రూ.3 కోట్లతో జీవీఎంసీ బ్రిడ్జి నిర్మించింది. దానిపై తారు రోడ్డు వేయడంతో స్థానికులకు, వాహన చోదకులకు గతంలో లేని సౌకర్యం ఇప్పుడు లభించింది. అంతవరకు బాగానే ఉంది. బీఆర్‌టీఎస్ రహదారిలో చినగదిలి కూడలి నుంచి ఈ బ్రిడ్జి వరకు తారు రోడ్డు నిర్మించారు. దానికి ఇరుపక్కలా పెద్ద కాలువలు, వాటిపై ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు. గెడ్డ వైపు ఉండే కాలువపై కట్టిన ఫుట్‌పాత్ ఈ బ్రిడ్జి వద్ద 10 మీటర్ల దూరంలో ముగిసింది. దీని నుంచి బ్రిడ్జి వరకు 15 అడుగుల లోతైన కాలువ ఉంది. బ్రిడ్జి నిర్మించిన అధికారులు ఇక్కడ రక్షణ గోడ విషయం మరిచిపోయారు. రాత్రి సమయంలో ఫుట్‌పాత్‌పై నడిచి వెళ్లేవారు, వాహనాలను తప్పించుకొని రోడ్డు అంచున నడిచేవారు ఇబ్బంది పడుతున్నారు. ఆదమరిచి నడిస్తే ఇక్కడ గెడ్డలో పడి పెద్ద ప్రమాదానికి గురికాక తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రక్షణ గోడ నిర్మించాలని జీవీఎంసీ అధికారులను కోరుతున్నారు.

ఎస్ యోగా సభ్యురాలు రష్మికకు సత్కారం

ఎంవీపీకాలనీ: యోగాసనాల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన శివాజీ పార్కు ఎస్ యోగా సభ్యురాలు రష్మికను ఘనంగా సత్కరించారు. ఈ నెల 14, 15 తేదీల్లో భీమిలిలో విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి యోగాసన అండ్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్-2024 నిర్వహించారు. ఈ పోటీల్లో రష్మిక ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటారు. ఈ సందర్భంగా సోమవారం ఆమెను శివాజీ పార్కులో జరిగిన కార్యక్రమంలో ఎస్ యోగా ప్రతినిధులు సత్కరించి అభినందించారు.

సాగరతీరంలో ఓజోన్ డే ర్యాలీ


అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఐఐఏఎం ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు

బీచ్‌రోడ్డు: అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్(ఐఐఏఎం) వైజాగ్ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో సాగరతీరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ర్యాలీని సంస్థ అధినేత డాక్టర్ ఎస్.పి. రవీంద్ర, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.ఎం. బాలాజీ ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ, ఓజోన్ పొర ఆవశ్యకతను చాటిచెబుతూ ర్యాలీ చేశారు. నిర్వాహకులు, యువత బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని, పర్యావరణ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అందరూ ఓజోన్ పొరను రక్షించాల్సిన అవసరం ఉందని, భూమిపై ప్రాణాలను రక్షించడంలో దాని కీలక పాత్రపై అవగాహన పెంచాలని సూచించారు. ర్యాలీలో నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, స్థానిక సంఘం సభ్యులు సుమారు 200 మంది వరకు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ


ఆరిలోవలో శాంతి ర్యాలీ చేస్తున్న ముస్లింలు


మద్దిలపాలెం కూడలి మీదుగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఆరిలోవ: ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఆరిలోవ ప్రాంతంలో సోమవారం ఘనంగా జరిగాయి. మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ముస్లింలు మసీదుల్లో భక్తితో ప్రార్థనలు, నమాజ్ చేశారు. ఈ సందర్భంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆరిలోవ కాలనీ, టీఐసీ పాయింట్, ముస్తఫా కాలనీ, రవీంద్రనగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లోని మసీదుల్లో నమాజ్ అనంతరం ముస్లింలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా పాత ఆరిలోవ చేరుకున్నారు. అక్కడ నుంచి తోటగరువు, హనుమంతవాక మీదుగా పాత పోస్టాఫీస్‌కు వెళ్లి అక్కడ మసీదులో జరిగిన ఈద్ మిలాద్ ఉన్ నబీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు

మద్దిలపాలెం: ఈద్ ఏ మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మంగాపురం కాలనీలోని మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అధిక సంఖ్యలో ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించి మద్దిలపాలెం మీదుగా వన్‌టౌన్‌లోని హజ్రత్ ఇషాక్ మదీనా ఔలియా దర్గాకు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ దేవస్థానంలో మహా అన్నదానం

సీతమ్మధార: ఆశీలమెట్టలోని శ్రీ సంపత్ వినాయగర్ ఆలయ ఆవరణలో నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా సోమవారం 2 వేల మంది భక్తులకు మహా అన్నదానం చేశారు. మధ్యాహ్నం దేవస్థానం అధికారుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఉత్సవాల్లో పాల్గొన్న సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణను ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది జి.గోవింద రెడ్డి, ప్రధాన అర్చకుడు మోహన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్ సంస్థల అధినేత వెంకటరమణను సత్కరిస్తున్న ఈవో శిరీష, చోళన్ తదితరులు

సీతారాం ఏచూరి జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి

మద్దిలపాలెం: విద్యా వ్యవస్థలో సామాజిక మార్పునకు విద్యార్థి నేతగా సీతారాం ఏచూరి ఎనలేని కృషి చేశారని రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు కొనియాడారు. గొప్ప వ్యక్తి ఏచూరి జీవితాన్ని తెలుగు పాఠ్యాంశంగా చేర్చాలని ఒక ప్రకటనలో ఆయన కోరారు. నిరుపేదలకు, అణచివేతకు గురైన సామాజిక తరగతులకు ఉన్నత విద్యావకాశాలు హక్కుగా సిద్ధించాలని పరితపించి, ఆ దిశగా పోరాడిన నవతారం నేత సీతారాం ఏచూరి అని అభివర్ణించారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పేరు తెచ్చుకున్న ఆయన తెలుగు వారు కావడం మన అదృష్టమన్నారు. హిందుస్థాన్ టైమ్స్‌కు లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ పేరుతో అనేక ప్రముఖ వ్యాసాలు రాశారని గుర్తు చేశారు. నవతరం నాయకుల్లో న్యాయమైన వ్యక్తిగా ఉన్న ఏచూరి జీవిత చరిత్రను తెలుగు పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం 8 నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పవిత్ర ఆవరోహణం, మహా పూర్ణాహుతి, ఆశీర్వచనం జరిపారు. దేవస్థాన వేద పండితులు, అర్చకుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధనలు


కేఆర్ఎం కాలనీలో అన్నప్రసాదం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎం కాలనీలో వరసిద్ధి వినాయక గురు సాయినాథ సహిత శ్రీ కోదండ రామాలయం కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహా అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ మొల్లి అప్పారావు భక్తులకు అన్నప్రసాదం వడ్డంచారు. కార్యక్రమాన్ని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పర్యవేక్షించారు.

- 15వ వార్డు ఉమానగర్‌లో మహా అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు తనయుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సందడిగా నిమజ్జనం

పాత వెంకోజీపాలెం రామాలయం వద్ద లేజీ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలతో వినాయక విగ్రహ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గణపతి లడ్డూ వేలం వేశారు. భక్తులకు ప్రసాదం పంచారు.

సంఘ స్థలానికి ఫెన్సింగ్


సంఘ స్థలంలో వేసిన ఫెన్సింగ్ పోల్స్

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెం శ్రీ సీతారామా సేవా సంఘానికి చెందిన గవర వీధిలోని స్థలానికి సోమవారం ఫెన్సింగ్ పనులు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఫెన్సింగ్ పోల్స్ ఏర్పాటు చేస్తున్నామని సంఘ ప్రతినిధి పరదేశినాయుడు తెలిపారు. గవర వీధిలోని పెద్ద నుయ్యి వద్ద మూడు సెంట్ల స్థలం 101 ఏళ్లుగా ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఈ స్థలాన్ని బాగు చేస్తున్నామని చెప్పారు.

మాజీ ఎంపీ ఎంవీవీకి శుభాకాంక్షలు


ఎంవీవీ సత్యానారాయణకు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న నాగిరెడ్డి, నాయకులు

ఎంవీపీకాలనీ: విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. లాసన్స్ బే కాలనీలోని ఎంవీవీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమక్షంలో జరిగిన వేడుకల్లో ఆయన కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఎంవీవీకి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఎంవీవీ జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, విశాఖ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జీవీ, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, తిప్పల దేవన్‌రెడ్డి, అనిల్‌రాజు, తిప్పల వంశీ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాహనాల టెస్ట్‌లు ప్రైవేటుపరం చేయొద్దు



మాట్లాడుతున్న పడాల గోవింద్

మద్దిలపాలెం: వాహనాల ఫిట్‌నెస్‌తోపాటు డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్‌లను ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దని ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ విజ్ఞప్తి చేశారు. మద్దిలపాలెంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటార్ సవరణ చట్టం న్యాయ సంహిత బిల్లులో వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్ టెస్టింగ్ చేసే ట్రాక్‌లను ప్రైవేట్ సంస్థలకు అప్పగించి, ఆటోమేటిక్ సెన్సార్ టెస్టింగ్ ట్రాక్ ద్వారా జారీ చేసే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. దీని వల్ల రోజూ ఆటో నడిపితే గాని పూట గడవని డ్రైవర్లు, వారి కుటుంబాలు అనేక ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. గతంలో మాదిరిగానే ఆర్టీవో కార్యాలయం ద్వారా రిజిస్ట్రేషన్లు, సర్టిఫికెట్లు, లైసెన్సులు జారీ చేసే విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఈ ప్రతిపాదన రద్దయ్యే వరకు డ్రైవర్లు ఉద్యమ పోరాటానికి సిద్ధమవ్వాలని పడాల గోవింద్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాసు, లోవరాజు, శివ, శ్రీను, నాగు, నంద, గురునాథ్ తదితర డ్రైవర్లు పాల్గొన్నారు.

సమాజ సేవలో 'జేసీఐ'


సమావేశంలో పాల్గొన్న జేసీఐ సభ్యులు

బీచ్‌రోడ్డు: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో సోమవారం రామ్‌నగర్‌లోని ఓ హోటల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జేసీఐ జోన్-4 అధ్యక్షుడు సురేష్ గొంప మాట్లాడుతూ సంస్థ కార్యకలాపాలు, లక్ష్యాలను వివరించారు. అధికార ప్రతినిధి కె.వి.రావు మాట్లాడుతూ జేసీఐ వీక్ పేరిట ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గౌరవ అతిథి సాయిసుధీర్ మాట్లాడుతూ ఈ సారి డైమండ్ జూబిలీ, గ్రేట్ డే సంబరాలు నిర్వహించామన్నారు. యువకులంతా సమాజ సేవకు ముందుకు రావడం హర్షణీయమని అతిథులు కొనియాడారు. కార్యక్రమంలో కమల్ పాత్ర అవార్డు పేరిట ఎం.భానుకిరణ్, ఔట్ స్టాండింగ్ యంగ్ ప్రొఫెషనల్ పేరిట మంత్రవాది ఫణిశర్మలకు పురస్కారాలు అందజేసి, ఘనంగా సత్కరించారు. సంఘ ప్రతినిధులు హాకల్య, దిలీప్‌కుమార్, సోమశేఖర్, పి.చంద్రశేఖర్, భాను, కె.ఆర్.వెంకటరమణ, వి.శివకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గీతా ప్రచార సమితి గౌరవాధ్యక్షుడు కృష్ణమూర్తి మృతి


యెండూరి కృష్ణమూర్తి (ఫైల్)

డాబాగార్డెన్స్: గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు, భగవద్గీత ప్రచారకుడు యెండూరి కృష్ణమూర్తి(94) సోమవారం కన్నుమూశారు. రామ్‌నగర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. పాతనగరంలో భగవద్గీత కోసం ఏర్పాటు చేసిన శ్రీగీతా ప్రచార సమితి ద్వారా 50 ఏళ్లకు పైగా ఆధ్యాత్మిక సేవలందించారు. ద్వారకానగర్‌లోని వారి కుటుంబ సభ్యుల స్వగృహం నుంచి కాన్వెంట్ జంక్షన్‌లోని హిందూ శ్మశానవాటికలో సంప్రదాయ రీతిన అంత్యక్రియలు జరిపారు. కృష్ణమూర్తి అకాల మృతికి గీతా ప్రచార సమితి అధ్యక్షుడు సిహెచ్.విశ్వేశ్వరరావు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, సమితి ఉపాధ్యక్షుడు పి.జగన్ మోహన్‌రావు, కార్యదర్శి ఎం.వనజాదేవి, కోశాధికారి జి.వి.ఆర్.ప్రసాద్ సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పలువురు సభ్యులు కృష్ణమూర్తి మృతికి సంతాపం తెలిపారు

పచ్చని కొండపై మంట


కంబాలకొండ రిజర్వ్ ఫారెస్టు వద్ద సోమవారం ఉదయం అకస్మాత్తుగా పొగ వ్యాపించింది. పచ్చని చెట్లను నాశనం చేసి, తోటలను ఆక్రమించడానికి ఆక్రమణదారులు మంటలు పెట్టారు. ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ఎంతో మంది ప్రయత్నాలు చేసినట్లు స్థానిక ప్రజలు చెబుతున్నారు.
- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం